క్లుప్తంగా

ఘనంగా లక్షపత్రి పూజ



స్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కె.గంగవరం: మండలంలోని పామర్రులోని శివాలయం వద్ద సోమవారం వెంటూరు మాసశివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. పాలెపు సత్యశ్రీనివాస్, రఘునాథ్, తేజ నిర్వహణలో వేద పండితులు ఉదయం నుంచి అభిషేకాలు, పత్రి పూజ, కుంకుమ పూజ, ధూప సేవ, హోమంతో పాటు శాంతి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పూజల్లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి శాంతి కల్యాణం తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గ్రామాల్లో ఆరోగ్య సురక్ష వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య పరీక్షలను చేశారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు పి.రత్నకుమారి, పి.చంద్రమౌళి, కరుణేంద్రకుమారి పర్యవేక్షణలో గ్రామాల్లో వైద్య ఆరోగ్య కార్యకర్తలు పరీక్షలను చేశారు. ప్రత్యేక పరికరాలు ద్వారా బీపీ, షుగరు, కళ్ళు, తదితర ఏడు పరీక్షలను చేశారు. వైద్య నిపుణులు హాజరయ్యే శిబిరాల్లో అవసరమైన వారికి చికిత్స చేయించనున్నట్టు వైద్యాధికారులు తెలిపారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

కె.గంగవరం: మండలంలోని సుందరపల్లి గ్రామ సచివాలయం వద్ద నేడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని సచివాలయ సిబ్బందితో పాటు పలు గ్రామాలకు చెందిన సచివాలయ సిబ్బందికి ఈ కార్యక్రమం నిర్వహణకు విధులు కేటాయించామన్నారు. వైద్య సిబ్బంది అందరూ అందుబాటులో ఉంటారని ప్రజలు ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటిన భవిత



నగదు బహుమతి, మెమెంటో, ప్రశంసా పత్రాలను అందుకుంటున్న భవిత

రామచంద్రపురం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో కాకినాడ బ్రహ్మ సమాజం, బ్రహ్మ ధ్యాన వక్తృత్వ పోటీలలో మండలంలోని వెలపాలెంకు చెందిన తలాటం సూర్య భవిత వక్తృత్వం విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకుని రూ.5 వేలు నగదు బహుమతి, వ్యాసరచన పోటీలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుని రూ.3 వేలు నగదు బహుమతి అందుకుంది. బాలికను సర్పంచ్ టేకుమూడి సుజాత, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, పలువురు గ్రామస్తులు అభినందించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



లబ్ధిదారునికి పింఛన్‌సాయం అందిస్తున్న వలంటీర్ నగ్మా

మండపేట: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుని వద్దకు వెళ్లి పింఛన్ సాయం అందించారు స్థానిక 15వ వార్డుకు చెందిన వలంటీర్ అందే నగ్మా. పట్టణంలోని గొల్లపుంత ప్రాంతానికి చెందిన పుట్టా పట్టాభి రామన్న అనారోగ్యంతో కాకినాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు ఆయన రాలేని పరిస్థితుల్లో ఉండడంతో వలంటీర్ నగ్మా ఆస్పత్రికి వెళ్లి రూ. 2,750 పింఛన్‌సాయం అందజేశారు. ఆమెను వార్డు కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్ అభినందించారు.

వృద్ధులకు ఆసరాగా నిలవాలి

రాయవరం: వృద్ధాప్యం శాపం కాదు..వరం అనేలా వృద్ధులకు ఆసరాగా నిలవాల్సిన అవసరం ఉందని తూర్పుగోదావరి జిల్లా వలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి అన్నారు. రాయవరం సంజయ్‌గాంధీ మెమోరియల్ వృద్ధాశ్రమంలో సోమవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు పులిదిండి సుందరరాజు, సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫణికృష్ణారెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వృద్ధులు చేసుకునే యోగాసనాలను వివరించి, వారికి పాల ప్యాకెట్లు, పౌష్టికాహారాన్ని అందజేశారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు సుందరరాజు ఆధ్వర్యంలో కేకును కట్ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం వార్డెన్ గంగాభవాని, సోషల్ వర్కర్ సుబ్బలక్ష్మి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి 23 రామాలయాలు

- 24 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వెల్లడి
- ఆయా గ్రామాల పెద్దలు, ఆలయ కమిటీల సభ్యులతో భేటీ



ఎమ్మెల్సీ తోటను సత్కరిస్తున్న మారేడుబాక శెట్టిబలిజ సంఘం నాయకులు

మండపేట: మండపేట నియోజకవర్గానికి 23 రామాలయాలు మంజూరైనట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రకటించారు. అలాగే 24 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద నెలకు రూ.ఐదు వేల చొప్పున మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండపేటలోని స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి ఆయా గ్రామాలకు చెందిన సంఘ పెద్దలు, ఆలయ కమిటీల సభ్యులతో ఎమ్మెల్సీ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేతలు రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, మండల మాజీ ఉపాధ్యక్షుడు గొలుగూరి విజయభాస్కరరెడ్డి, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ మండపేట మండలంలోని అర్తమూరు, ఏడిద సావరం, పాలతోడు, కేశవరం, వెలగతోడు, మెర్నిపాడు, మారేడుబాక, వేములపల్లి, కపిలేశ్వరపురం మండలంలో నల్లూరు, నేలటూరు, కేదారిలంక, నిడసనమెట్ట, పడమఖండ్రిక, అద్దంకివారిలంక, అంగర, రాయవరం మండలం లొల్ల, వెదురుపాక, మాచవరం, సోమేశ్వరం, రాయవరం, చొల్లంగివారి పేట, వెంటూరు, శ్రీరామ్‌నగర్ కాలనీలకు రామాలయాలు మంజూరైనట్టు వివరించారు. ఒక్కో ఆలయానికి రూ. 10 లక్షల చొప్పున మంజూరయ్యాయన్నారు, త్వరితగతిన పనులు మొదలు పెట్టి నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఆయా గ్రామాల నేతలు, సంఘ పెద్దలు కృషి చేయాలన్నారు. వెంటనే బిల్లులు విడుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరూ ఇబ్బంది పడవద్దని, అదనంగా ఎక్కడైనా రామాలయాలు అవసరమైతే మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు.

ఆయన చేతులెత్తేశారు

తన వల్ల కాదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతులు ఎత్తేసిన ఎన్నో పనులను తాను చేసి చూపించానని ఎమ్మెల్సీ తోట అన్నారు. మాచవరంలోని దేవుడు కాలనీకి రామచంద్రపురం రోడ్డుకు మధ్య కెనాల్ రోడ్డుపై వంతెన నిర్మాణం, సోమేశ్వరంలో సబ్‌స్టేషన్, మండపేటలో డంపింగ్ యార్డుకు 2.75 ఎకరాల స్థలసేకరణ, మెర్నిపాడు-జేగురుపాడు బైపాస్ రోడ్డు ఇలా ఎన్నో పనులు చేశామన్నారు. గతంలో ఆ పనులు చేయడం తన వల్ల కాదని చెప్పిన ఎమ్మెల్యే వేగుళ్ల ఆయా గ్రామాల ప్రజలను ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. గత ఎన్నికల ముందు కనీసం మంజూరు కూడా లేకుండా పలు రామాలయాల నిర్మాణానికి ఎమ్మెల్యే వేగుళ్ల కొబ్బరికాయలు కొట్టి ఓట్లు వేయించుకున్నారన్నారు. తర్వాత చేతులు ఎత్తేస్తే వాటికి మంజూరు తెచ్చి పనులు చేస్తున్నామని ఎమ్మెల్సీ తోట అన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న తమ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. అంతకు ముందు పలువురు నాయకులు మాట్లాడుతూ తమ తమ గ్రామాల్లో ఎన్నో ఏళ్ల నాటి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తూ ఎమ్మెల్సీ తోట చేసిన అభివృద్ధి పనులను వివరించారు. రామాలయాల మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వివిధ సంఘాల పెద్దలు ఎమ్మెల్సీ తోటను ఘనంగా సత్కరించారు. పార్టీ నేత మేడిశెట్టి దుర్గారావు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, మారేడుబాక, సోమేశ్వరం సర్పంచులు మట్టపర్తి గోవిందరాజులు, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై అవగాహన



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

రామచంద్రపురం: విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజల భద్రతపై అవగాహన పెంచేందుకు తూర్పు ప్రాంత విద్యుత్ కంపెనీ సంస్థ సీఎండీ ఆదేశాల మేరకు విద్యుత్ భద్రత అవగాహన మరియు ఫీల్డ్ లైన్‌మన్లకు భద్రత సూచనలు చేసేందుకు విద్యుత్ భద్రతా రథం ద్వారా ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్ తెలిపారు. విద్యుత్ భద్రత అవగాహన రథాన్ని టౌన్ సెక్షన్‌లో సోమవారం ప్రారంభించి అధికారులు, విద్యుత్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ వర్షం వచ్చినప్పుడు లైన్ల కింద కానీ చెట్లు కింద ఉండరాదని, విద్యుత్ స్తంభాలు, విద్యుత్తుకు సంబంధించిన ఏ వైర్లయినా తెగి కింద పడినప్పుడు వెంటనే విద్యుత్ కాల్ సెంటర్ నంబరు 1912కు లేదా విద్యుత్ సబ్ స్టేషన్ లైన్‌మన్‌కు తెలపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టౌన్ విద్యుత్ సిబ్బంది ఈఆర్‌ఓ సిబ్బంది మరియు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పాల్గొన్నారు.

కొట్టి గాయపరిచిన వారిపై కేసు నమోదు

కపిలేశ్వరపురం: అంగరలో గణేశ్ నవరాత్ర ఉత్సవాల ఊరేగింపులో జరిగిన గొడవలో పలువురుకి రక్తపు గాయాలయ్యాయి. ఎస్సై చంటి కథనం ప్రకారం.. పడమర ఖండ్రిక గానుగ చెట్టు సెంటర్‌లోని గణేశ్ నవరాత్ర శిబిరం నుంచి ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. అంగర ఎస్సీపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు ఊరేగింపు చేరుకున్నాక నిందితులు కొండేటి బద్రి, బెల్లం కిరణ్‌కుమార్, కొండేటి కిరణ్ మధు, తంగిడిమిల్లి లోకేష్, మరికొందరు ఊరేగింపులో ఉన్నవారితో గొడవ పడ్డారు. ఫిర్యాది కొమ్మిశెట్టి నరేష్, మరికొందరిపై దుర్భాషలాడారు. అలా చేయడాన్ని నరేష్ మరికొందరు ప్రశ్నించగా వారిని నిందితులు ఇటుకలతో కొట్టి గాయపరిచారు. దీంతో సుంకర సుభాష్, కవల వెంకన్న, కరుప్రోలు సురేష్‌లకు రక్తపు గాయాలయ్యాయి. ఫిర్యాది నరేష్ వీపుపై నిందితుడు తంగిడిమిల్లి లోకేష్ బ్లేడుతో గాయపరిచాడు. చికిత్స నిమిత్తం వారిని కపిలేశ్వరపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

ఇదే ఘటనలో కొందరిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు అంగర ఎస్సై చంటి తెలిపారు. ఎస్సీ పేటకు చెందిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులోని ఫిర్యాదు నేల అజయ్, అతని స్నేహితులు బద్రి, మనోజ్, కోటి మరికొందరు ఊరేగింపు చూసేందుకు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిలుచున్నారు. ఎస్సీ పేటకు చెందిన కిశోర్, శాంతి లోకేష్, ఊరేగింపులో ఉన్న నిందితులైన కొమ్మిశెట్టి సత్యసాయి, కొమ్మిశెట్టి రామచంద్రరావు, మొండి తేజ, వంగా వేణులు వివాదపడ్డారు. వారిని వారించేందుకు ఫిర్యాదుదారు నేల అజయ్ ప్రయత్నం చేయగా నిందితులంతా ఇటుకలతో కొట్టారు. దీంతో నేల అజయ్ తలకు, కనికెళ్ళ కొండయ్య ఉదరభాగంపైనా గాయాలయ్యాయి. వారిని కపిలేశ్వరపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసును నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

దాతల సహకారాలను ఆదర్శంగా తీసుకోవాలి



గొల్లపాలెంలో సాఫ్ట్ బాల్ క్రీడాకారులకు ఆట వస్తువులు అందజేస్తున్న బుచ్చిరెడ్డి, మాచారెడ్డి తదితరులు

కాజులూరు: పాఠశాలలలో క్రీడల అభివృద్ధికి పలువురు దాతలు అందిస్తున్న సహకారాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి అన్నారు. గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు మొగలిపాలెం రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు సమకూర్చిన రూ.40 వేలు విలువైన బ్యాట్లు, బాల్స్, గ్లౌజులు తదితర ఆట వస్తువులను సోమవారం బుచ్చిరెడ్డి, ఉత్తరాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు నల్లమిల్లి మాచారెడ్డిలు సంయుక్తంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వంతో పాటు స్పోర్ట్స్ కోటాలో ఉన్నత ఉద్యోగాలను సాధించుకోవచ్చన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆడ్డగళ్ల నాగరాంప్రసాద్, స్కూల్ పీడీ సునీల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు దాతలను అభినందిస్తూ శాలువాలతో ఘనంగా సత్కరించారు.

గ్రామ పరిపాలన వ్యవస్థ బలోపేతం



రామచంద్రపురం పట్టణంలో జరిగిన స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్న మంత్రి వేణు



రామచంద్రపురం పట్టణంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి వేణు



కె.గంగవరంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- రామచంద్రపురంలో స్వచ్ఛతా ర్యాలీ
- మహాత్మునికి ఘన నివాళి

రామచంద్రపురం: గ్రామాలకు సుపరిపాలన వస్తేనే గ్రామాభివృద్ధి జరుగుతుందనే మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో పాటు వలంటరీ వ్యవస్థను తీసుకుని వచ్చి గ్రామ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేశారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. జాతిపిత గాంధీ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలో స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ర్యాలీలో మంత్రి వేణు పాల్గొన్నారు. పట్టణంలోని 18వ వార్డు కమ్మవారిసావరం నుంచి 6వ వార్డు శీలంవారిసావరం వరకు భారీ స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. మంత్రి వేణు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రజానీకానికి వారికి కావలసిన పౌర సేవలు అందే విధంగా 2019 అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను సీఎం ప్రారంభించారన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా సచివాలయ వ్యవస్థ ద్వారా పౌరులకు కావలసిన అన్ని పౌర సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గతంలో పౌరులు తమ కావాల్సిన సేవలు కోసం ఎంతో కాలంగా నిరీక్షించే వారని సచివాలయ వ్యవస్థ ద్వారా ఆ సమస్యలు తీరాయన్నారు. అదే విధంగా వలంటరీ వ్యవస్థను తీసుకుని వచ్చి పౌర సేవలను ఇంటి వద్దకే అందే విధంగా రాష్ట్రంలో పరిపాలన జరుగుతుందన్నారు. మహాత్మాగాంధీ ఆలోచనలు, భావాలు, సిద్ధాంతాలు స్ఫూర్తిగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారని వీరి ఆదర్శాలకు అనుగుణంగా రామచంద్రపురంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులతో ముందుకు వెళుతున్నట్లు మంత్రి తెలిపారు. స్వచ్ఛ రామచంద్రపురంలో భాగంగా ప్రణాళికాబద్ధంగా ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ర్యాలీ అనంతరం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద గల గాంధీ విగ్రహానికి పూలమాల వేసి మంత్రి వేణు ఘనంగా నివాళులర్పించారు. ఈ ర్యాలీలో మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు గాదె సీతారామలక్ష్మి, కేతా సుజాత, కేతా శ్రీను, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు కంచుమర్తి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

కాజులూరు: గాంధీ ఆశయసాధనకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని ఎంపీపీ మాతా భారతి అన్నారు. సోమవారం మండల గ్రామాల్లో అధికారులు, నాయకులు గాంధీ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట సర్పంచ్ దండంగి సరోజని, ఎంపీపీ మాతా భారతి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించగా, గొల్లపాలెం, ఆర్యావటంలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆర్యావైశ్య సంఘం నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కె.గంగవరం: గాంధీ జయంతిని స్థానిక సచివాలయం వద్ద సర్పంచ్ కోటి నరసమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన జయంతి ఉత్సవాల్లో ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీడీఓ శ్రీనివాస్, తహశీల్దార్ వైద్యనాథశర్మ, ఎంఈఓ నాగరాజు పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. దంగేరు పంచాయతీ వద్ద జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని గాంధీ చిత్రపటానికి ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్ రమణ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో సోమవారం గాంధీ జయంతి పురస్కరించుకుని గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్ పాలనలో నిజమైందని ద్రాక్షారామ, హసన్‌బాద, వెలంపాలెం సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, నాగిరెడ్డి సతీష్‌రావు, టేకుమూడి సుజాత పేర్కొన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై, పరిష్కరించాల్సిన సమస్యలపై చర్చించారు.

జగన్‌తో గ్రామ స్వరాజ్యం సాకారం



మండపేట 25వ వార్డులో గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



అంగర గాంధీ సెంటర్‌లో గాంధీకి నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు



రాయవరంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటరమణ తదితరులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

మండపేట: మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణంలోని 6, 25వ వార్డుల్లో నిర్వహించిన గాంధీజీ జయంతి వేడుకలకు ఎమ్మెల్సీ తోట ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబులతో కలిసి బాపూజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట తన ప్రసంగంలో స్వాతంత్ర్య సాధనలో గాంధీజీ సేవలను కొనియడారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్ ముక్కా లోవలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, వైఎస్సార్ సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, పట్టణ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, బొక్కా సరస్వతి, అమలదాసు లక్ష్మి, నీలం దుర్గ, పిల్లి శ్రీనివాస్, షేక్, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్లు ఆలీఖాన్ బాబా, మీగడ శ్రీనివాస్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మున్సిపల్ గాంధీజీ చిత్ర పటానికి చైర్‌పర్సన్ దుర్గారాణి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బాపూజీ విగ్రహానికి ఎంపీపీ సభ్యుడు వుండమట్ల శ్రీనివాస్, ఎంపీడీఓ ఐ.రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: మహాత్మా గాంధీ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆయన జయంతి వేడుకల్లో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, తాతపూడి, పడమర ఖండ్రిక, వల్లూరు, టేకి, నేలటూరు, మాచర, కోరుమిల్లి, అద్దంకివారిలంక, కేదారిలంక, వెదురుమూడి, నిడసనమెట్ట, అచ్యుతాపురం, వడ్లమూరు, నల్లూరు నాగుల చెరువు గ్రామాల్లో సోమవారం గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీకి నివాళి అర్పించారు. గ్రామ సచివాలయాల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి గ్రామ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. అంగర పోలీస్ స్టేషన్‌లో మండపేట రూరల్ ఎస్‌ఐ శ్రీధర్ గాంధీజీకి నివాళి అర్పించారు.

రాయవరం మండలంలో..

రాయవరం: గ్రామ స్వరాజ్యం, పాలనలో వికేంద్రీకరణతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్న గాంధీ మహాత్ముడి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేస్తున్నారని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహాత్ముడి విగ్రహంతో పాటుగా, బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బస్టాండ్ సెంటర్, చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద ఉన్న బాపు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప సర్పంచ్ బొడ్డు శ్రీను, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి పాల్గొన్నారు. సోమేశ్వరం బస్టాండ్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ శాకా ఆదినారాయణ, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు..

ఎక్కువ మందికి 'ఉపాధి' కల్పించాలి

రాయవరం: గ్రామాల్లో ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పించేలా పనులను గుర్తించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ సూచించారు. ఉపాధి హామీ పనుల గుర్తింపునకు సోమవారం రాయవరంలో ఇనీషియల్ గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి కూలీలందరికీ పని కల్పించేలా పనులను గుర్తించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి పనుల గుర్తింపులో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారాన్ని తీసుకోవాలన్నారు. మండల ఉపాధి ఏపీవో జె.సుధారాణి మాట్లాడుతూ గ్రామాల వారీగా ఉపాధి సిబ్బంది పనులను గుర్తిస్తారన్నారు. ఇందుకు అవసరమైన షెడ్యూల్‌ను కూడా విడుదల చేశామన్నారు. అలాగే మాచవరం, పసలపూడి, వెదురుపాక, లొల్ల, వి.సావరం, కూర్మాపురం పంచాయతీల్లో ఆయా సర్పంచుల ఆధ్వర్యంలో ఇనీషియల్ గ్రామ సభలు నిర్వహించారు. మంగళవారం నదురుబాద, సోమేశ్వరం, బుధవారం కురకాళ్లపల్లి, వెంటూరు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు సుధారాణి తెలిపారు. గ్రామసభల్లో ఉపాధి హామీ పథకం జేఈ ఈశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పనుల గుర్తింపునకు గ్రామసభల షెడ్యూల్

ఉపాధి హామీ పథకంలో భాగంగా కొత్త పనుల గుర్తింపుకు గ్రామ సభల షెడ్యూల్‌ను ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి సోమవారం విడుదల చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కొత్త పనులు గుర్తింపు, లేబర్ బడ్జెట్ తయారీకి గ్రామాల వారీగా నిర్వహించే గ్రామ సభల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 7న రాయవరం, మాచవరం, 10న వి.సావరం, కూర్మాపురం, 16న వెదురుపాక, పసలపూడి, 21న లొల్ల, చెల్లూరు, 26న నదురుబాద, కురకాళ్లపల్లి, 31న సోమేశ్వరం, వెంటూరు గ్రామాల్లో ఉదయం 10 గంటలకు గ్రామ సభలు నిర్వహిస్తారు. రెండు టీమ్‌లుగా ఏర్పడి అధికారులు ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నరేంద్రరెడ్డి వివరించారు.

రైతు సేవా కేంద్రాలుగా ఆర్బీకేలు



వెల్లలో రైతు భరోసా కేంద్రం వద్ద విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: ఆంధ్రప్రదేశ్‌లో రైతుల సేవాకేంద్రాలుగా రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే)లు ఎనలేని సేవలు అందిస్తున్నాయని సెంచూరియన్ యూనివర్శిటీ అగ్రికల్చరల్ విద్యార్థులు సోమవారం అన్నారు. యూనివర్శిటీలో అగ్రికల్చరల్ బీఎస్సీ నాలుగో సంవత్సరం విద్యార్థులు మండలంలోని వెల్ల ఆర్బీకేని సందర్శించారు. ఆర్‌ఏడబ్ల్యూ ప్రాజెక్టు నిమిత్తం విద్యార్థులు రాకుర్తి పృథ్వీబ్రహ్మ, మేకల శశిప్రీతమ్, దొడ్డిగార్ల సిద్ధార్థలు వెల్ల గ్రామంలో పర్యటించారు. ఆర్బీకేలను సందర్శించి రైతులకు మేలు చేసేలా సమస్త సమాచారం, సిబ్బంది గ్రామ స్థాయిలోనే అందుబాటులో ఉంచేలా సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాలను అభినందించారు. అనంతరం ప్రాజెక్టులో భాగంగా అధ్యాపకులు చంద్రశేఖర్ సాహు, ద్వితీ సుందర్ రౌత్, అశోక్‌కుమార్‌ల పర్యవేక్షణలో విద్యార్థులు గ్రామంలో రైతులకు సంప్రదాయ వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. వివిధ రకాల పురుగు మందులు ఏఏ మోతాదులో వాడాలి, మంచి పంట ప్రజలకు ఏ విధంగా అందించాలన్న అంశాలపై, కలుపు మొక్కల నియంత్రించే నూతన పద్ధతులను రైతులకు వివరించారు. తక్కువ ఖర్చుతో పంటలను కాపాడుకునే విధానాలను తెలియజేశారు.

తపాలా ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయండి



ద్వైవార్షిక సభలో మాట్లాడుతున్న మర్రెడ్డి

రామచంద్రపురం: అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు అక్టోబర్ 4న దేశవ్యాప్తంగా జరగబోయే ఒక రోజు సమ్మెను జయప్రదం చేయాలని రాష్ట్ర తపాలా ఉద్యోగుల కార్యదర్శి వై.మర్రెడ్డి పిలుపునిచ్చారు. డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ హాల్లో సోమవారం రామచంద్రపురం బ్రాంచ్ గ్రామీణ తపాలా ఉద్యోగుల ద్వైవార్షిక సభకు ముఖ్యఅతిథిగా మర్రెడ్డి విచ్చేశారు. మన కోర్కెల సాధనకై ఉద్యోగులంతా ఈనెల 4న జరగబోయే దేశవ్యాప్త ఒక్కరోజు సమ్మెలో అందరూ పాల్గొనాలని కోరారు. పలు డిమాండ్ల సాధనే లక్ష్యంగా ఈ సభలో రాష్ట్ర తపాలా ఉద్యోగుల ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.హేమలత (బొబ్బిలి), రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాస్, పి.భూలోకం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.సురేంద్రనాథ్, వై.కామేశ్వరి, సీహెచ్ ఈశ్వరరావు, తదితరులు ప్రసంగించారు . అనంతరం నూతన కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో రామచంద్రపురం బ్రాంచ్ అధ్యక్షుడిగా వైఎస్ స్వరజన్ రాజు, కార్యదర్శిగా, ఎస్‌వీపీ మునేశ్వరరావు, కోశాధికారిగా వై.కామేశ్వరి, ఉపాధ్యక్షుడిగా జి.వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ప్రశాంత్ ఎన్నికయ్యారు.